# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 304 పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 30 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## మూసీ ప్రాజెక్టు.. పరిహారం, పునరావాసంలో రాజీ లేదు

**అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు**

**తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది**

**మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్..భూ సేకరణ, పునరావాసంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమీక్ష**



**హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర రాజధాని, మహానగరం హైదరాబాద్ భవిష్యత్ చిత్రపటాన్ని తిరగరాసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్' కేవలం ఒక నది శుద్ధీకరణ కార్యక్రమం మాత్రమే కాదు, ఇది తెలంగాణ భవిష్యత్తు ఆర్థిక, పర్యావరణ ప్రగతికి ఒక బలమైన పునాది అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. భాగ్యనగరానికి సరికొత్త జీవం పోస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజా జీవన ప్రమాణాలను ..మిగతా 2లో

## జీవితం అంటే పరుగుపందెం కాదు

# మన ఓపికకు పరీక్ష

**ఓపిక, నిలకడ శక్తితో చేపట్టిన పనులు పూర్తి చేయాలి**

**వీబీఐటీలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లెవ్‌లో నితిన్ నబీ**

**వర్చువల్‌గా పలు జిల్లాల కార్యాలయాలు ప్రారంభం**

**తెలంగాణలో బిజెపి అధికారానికి ఎంతో దూరం లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)**

జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లెవ్‌లో ఆయన పాల్గొన్నారు. భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదిలావుంటే రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు




చేసిన సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడే తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. ..మిగతా 2లో

## సీషెల్స్ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో మోదీ

**ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం**



**విక్టోరియా, జూన్ 29 (నమస్తే ఉదయం)**

భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ..మిగతా 2లో

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి

# మల్లికార్జున ఖర్గే



ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించిన రాజ్యసభ చైర్మన్-

ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నికైన ఖర్గే

రాజ్యసభ సభ్యునిగా ప్రమాణం చేసిన మల్లికార్జున ఖర్గే

2

## భారీ వర్షాలతో ఖమ్మంలో సిఎం ఆశీర్వాద సభ రద్దు

**నేడు శిల్పకలా వేదికగా రైతు భరోసా నిర్వహణ**

**హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)**



ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్ద య్యింది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్ రెడ్డి సభలో మార్పులు చేశారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం హైదరాబాద్ శిల్పకళా వేదికకు మార్చారు. సాయంత్రిం ఈ వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం ..మిగతా 2లో

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు

**రేవంత్ గెలిచింది ఆ ఓట్లతోనే**

**టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు**



**హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)**

దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరా బాద్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో ..మిగతా 2లో

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

**వచ్చే అసెంబ్లీకి ఇప్పటి నుంచే కసరత్తు**

**పార్టీ శ్రేణులకు కిషన్ రెడ్డి పిలుపు**

**హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)**



మనమందరం ఇప్పటి నుంచే ఎన్నికలకు సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న మూడు కార్పొరేషన్ ఎన్నికలతో పాటు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఈ రోజు నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. రానున్న ట్రై-కార్పొరేషన్ ఎన్నికల్లో మూడింటికి మూడు స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో తిరగాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి బాధ్యతగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేశారు. హైదరాబాద్ నగరం ప్రస్తుతం మజ్లిస్ పార్టీ కబంధ హస్తాల్లో చిక్కుకుందని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఏ అధికారులు ఉండాలో, ఎవరు ఎక్కడ ..మిగతా 2లో

## 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

**మంత్రి శ్రీధర్‌బాబు**



**హైదరాబాద్, జూన్ 29 (నమస్తే ఉదయం)**

2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వన్ ట్రిలియన్‌కు, భారత స్వాతంత్ర్య శతవార్షికోత్సవం జరిగే 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ..మిగతా 2లో

# మూసీ ప్రాజెక్టు.. పరిహారం, పునరావాసంలో రాజీ లేదు

**మొదటి పేజీ తరువాయి...**

అంతర్జాతీయ స్థాయికి పెంచేలా ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును ప్రభుత్వం రూపుదిద్దుతోందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర రాజధాని, మహానగరం హైదరాబాద్ భవిష్యత్ చిత్రపటాన్ని తిరగరాసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'మూసి పునరుజ్జీవ ప్రాజెక్ట్' కేవలం ఒక నది శుద్ధీకరణ కార్యక్రమం మాత్రమే కాదు, ఇది తెలంగాణ భవిష్యత్తు ఆర్థిక, పర్యావరణ ప్రగతికి ఒక బలమైన పునాది అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. భాగ్యనగరానికి సరికొత్త జీవం పోస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజా జీవన ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి పెంచేలా ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును ప్రభుత్వం రూపుదిద్దుతోందని ఆయన పేర్కొన్నారు.

ఈ మహా ప్రాజెక్టుకు అత్యంత కీలకమైన భూ సేకరణ, నిర్వాసితుల పునరావాసం తదితర అంశాలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం ఉన్నతాధికారులతో ఒక సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాల సరసన నిలబెట్టాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. మూసి నదిని పునరుజ్జీవింపజేసి, దాని చుట్టుపక్కల ప్రాంతాలను పర్యాటకం, ఉపాధి, మరియు ఆర్థికాభివృద్ధికి ప్రధాన కేంద్రాలుగా మార్చాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యొక్క దూరదృష్టి అని కొనియాడారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన మరియు పచ్చని జీవన వాతావరణాన్ని అందించడమే




ఈ ప్రాజెక్ట్ యొక్క అసలు లక్ష్యమని వివరించారు.

**సరికొత్త జీవన కేంద్రాలుగా మూసి తీరాలు..**

గత కొన్ని దశాబ్దాలుగా మూసి నది కాలుష్యం కారణంగా పరివాహక ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను, ముఖ్యంగా వర్షాకాలంలో వరదల వల్ల ఎదుర్కొంటున్న కష్టాలను మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రాజెక్ట్ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. వరద నియంత్రణ ఢ నీటి శుద్ధి: అత్యాధునిక సాంకేతికతతో వరదలను నియంత్రించడం, నీటిని శుద్ధి చేయడం. నది వెంబడి భారీగా పచ్చదనం పెంపొందించడం, అంతర్జాతీయ స్థాయి పార్కులు, వాక్‌వేలు, వినోద కేంద్రాల ఏర్పాటు. సరికొత్త రోడ్ల నెట్‌వర్క్ ద్వారా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం. వీటి ద్వారా మూసి పరివాహక ప్రాంతాలు సరికొత్త వైభవాన్ని సంతరించుకోనున్నాయి.

**పేదలకు అన్యాయం జరగనివ్వం.. అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు**

అభివృద్ధి పేరుతో పేదల పొట్ట కొట్టే సంస్కృతి ఈ ప్రభుత్వానికి లేదని మంత్రి పొంగులేటి గట్టిగా నొక్కిచెప్పారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగానే.. మూసి ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదని, ప్రతి ఒక్క నిర్ణయం మానవీయ కోణంలోనే ఉంటుందని స్పష్టం చేశారు. భూ సేకరణ ప్రక్రియలో అధికారులు ప్రజా పక్షాన ఆలోచించి, కారుణ్య దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

**మంత్రి జారీ చేసిన ముఖ్య ఆదేశాలు..**

తక్షణ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు: ప్రాజెక్ట్ కారణంగా ఇళ్లు కోల్పోయే ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలి. ఇందుకు సంబంధించిన కార్యాచరణను తక్షణమే రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలి. భూములు, ఆస్తులు కోల్పోయే బాధితులకు చట్టబద్ధమైన గరిష్ట పరిహారంతో పాటు, మెరుగైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడబోదు. తెలంగాణను ప్రగతి పథంలో నడిపించే ఈ బృహత్తర కార్యాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

**మొదటి పేజీ తరువాయి...**

పని చేయాలో సెక్రటేరియట్ నుండి కాకుండా దారుసలాం నుండి వచ్చే ఆదేశాలే నిర్ణయిస్తున్నా యని మండిపడ్డారు. ఈ దారుణమైన పరిస్థితి మారాలంటే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు గతంలో బీఆర్ఎస్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారని, కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా ప్రజలను మోసం చేసి మజ్లిస్ పార్టీకే కొమ్ముకాశాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి 50 శాతం స్థానాలు అందించి మోదీ ప్రభుత్వానికి అండగా నిలిచారని, అదే నమ్మకంతో రాష్ట్రంలోనూ మార్పు కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో,రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'సర్' పక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మజ్లిస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. సర్ వస్తుందంటే మజ్లిస్ పార్టీ ఎందుకు అంతగా భయపడుతోంది? పాతబస్తీలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు, ఇతర అక్రమ వలసదారుల ఓట్లు ఎక్కడ



తొలగిపోతాయోనని వారికి వణుకు పుడుతోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వ ఉ ద్యోగుల మీద నమ్మకం లేకపోవడం శోచనీయమన్నారు.

ఈ పక్రియలో పనిచేసేది కేంద్ర అధికారులు కాదు, తెలంగాణ ఉద్యోగులేనని గుర్తుచేశారు. గత 2002 లో ఇలాంటి సర్వే జరిగినప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ భాగస్వామ్యమే ఉందని, నాడు లేని భయం ఈ రోజు ఎందుకు అని నిలదీశారు. పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు అక్రమ వలసదారులు మనవాళ్లపై అరాచకాలు చేశారని, కానీ అక్కడ బీజేపీ పట్టు సాధించాక వారంతా తోకముడిచి బంగ్లాదేశ్ పారిపోతున్నారని వివరించారు. నగర రక్షణ కోసం 'సర్' లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, దీనిని అడ్డుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి హెచ్చరించారు. ఒకవేళ మీ ఓటు హైదరాబాద్‌లో ఉంటే గ్రామాల్లో రేషన్ కార్డులు, పింఛన్లు పోతాయంటూ కాంగ్రెస్ నాయకులు అమాయక ప్రజలను బెదిరిస్తున్నారు. ఓటు హక్కుకు, సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం ఉండదు. దీనివల్ల ఎవరి కార్డులు కట్ అవ్వవని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యకర్తలంతా బీఎల్ఓలతో కలిసి తిరిగి ప్రజల ఓటు హక్కును కాపాడాలని సూచించారు.

# 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు

**మొదటి పేజీ తరువాయి...**

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీలో దాదాపు 5 శాతం వాటాను అందిస్తున్నదని.. 2047 నాటికి ఈ వాటాను 10శాతానికి రెట్టింపు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు పాలన, పరిశ్రమలు, అట్టడుగు స్థాయి ఆర్థిక కార్యకలాపాలలో నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం కీలకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా భాగమని.. వీరికి ఈ ఏడాదే రూ.21,000 కోట్ల రుణాలు అందించామని.. ఎన్‌పీఏలు దాదాపు సున్నా స్థాయిలో ఉన్నాయని తెలిపారు. రాజకీయ పార్టీలు మారినా కొనసాగుతున్న విధాన స్థిరత్వం, సులభతర వాణిజ్య నిర్వాహణ పెట్టుబడిదారులకు భరోసానిస్తున్నాయని చెప్పారు. టీఎస్ ఐపాస్ సింగిల్ విండో వ్యవస్థ ద్వారా అనుమతులు 21 రోజుల్లోనే మంజూరవుతున్నాయని.. ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0 ద్వారా సాంకేతికత సహాయంతో మరింత పారదర్శకత, పెండింగ్ అనుమతుల రియల్-టైమ్ ట్రాకింగ్ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఏరోస్పేస్ రంగం ఇప్పుడు ఐటీ, ఫార్మా ఎగుమతులను మించిపోయిందని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్, రాబోయే రీజినల్ రింగ్ రోడ్, వరంగల్, ఆదిలాబాద్‌లలో నిర్మిస్తున్న కొత్త విమానాశ్రయాలు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా జిల్లా కేంద్రాలకు హైదరాబాద్ స్థాయి కనెక్టివిటీని విస్తరించనున్నట్లు తెలిపారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నెట్ జీరో కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 200 ఎకరాల్లో ఏఐ సిటీ, గ్రీన్ ఫార్మా యూనిట్లు, అన్ని తరగతుల వారికి నివాస ప్రాంతాలు, దేశంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో మొదటి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఉంటాయి. ఎంఎస్ఎంఈల విషయంలో వచ్చే ఐదేళ్ల కోసం రూ.600 కోట్లు కేటాయించామని.. ప్రతి జిల్లాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నామని మంత్రి ప్రకటించారు.



# రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, జూన్ 29 (నమస్తే ఉదయం)**

రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ రాజ మోదీ బులెటిన్ విడుదల చేశారు.

అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

“రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మరింత బలమైన సమన్వయం కోసం ఎదురుచూస్తున్నాను. తద్వారా మనమందరం కలిసి అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని మరింత జవాబుదారీగా చేయగలం. ప్రజల తీవ్రమైన ఆందోళనలు, ఆకాంక్షలు, గొంతులను మేము చిత్తశుద్ధితో, దృఢ విశ్వాసంతో, సంకల్పంతో లేవనెత్తుతూనే ఉంటాం. అదే మా ప్రధాన కర్తవ్యం. ఇది నా బాధ్యత కూడా. దీనిని నేను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తాను.” అని ఖర్గే ఎక్స్‌లో రాసుకొచ్చారు.

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, బీజేపీ నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది నూతన రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణం చేశారు.

నూతనంగా ప్రమాణం చేసిన వారిలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజారియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం. నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపూర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. ఛైర్మన్ ఛాంబర్, సభలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, సభ నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు.



# జీవితం అంటే పరుగుపందెం కాదు మన ఓపికకు పరీక్ష

**మొదటి పేజీ తరువాయి...**

అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణకు లీడర్లు ఎంతో దూరం లేరని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉండే 'డబుల్ ఇంజన్ సర్కార్' వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల అసలైన కలలు సాకారం కావాలన్నా, ఒక వికసిత తెలంగాణ నిర్మాణం జరగాలన్నా ప్రజలంతా బీజేపీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరగబోయే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. కాగా, సాయంత్రం వేళ నితిన్ నబీన్ పార్టీకి చెందిన బీఎల్ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు , ముఖ్య కార్యకర్తలతో సమావేశమై రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు.



# సీషెల్స్ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో మోదీ

**మొదటి పేజీ తరువాయి...**

ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# భారీ వర్షాలతో ఖమ్మంలో సీఎం ఆశీర్వాద సభ రద్దు

**మొదటి పేజీ తరువాయి...**

జగన్నాథపురంలో మంగళవారం రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు. అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. దీంతో ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి.. సభా వేదికను హైదరాబాద్‌కు మార్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

# కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు

**మొదటి పేజీ తరువాయి...**

కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొండగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉ ందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

# అగ్రి వర్శిటీ క్వార్టర్స్‌లో ఉంటున్న పోలీస్ అధికారులను ఖాళీ చేయించాలి

## డీజీపీని కలసిన వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సరర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్‌లు

**బుద్వేల్, జూన్ 29 (నమస్తే ఉదయం) :**

వ్యవసాయ వర్శిటీ క్వార్టర్స్ లో నివాసముంటున్న పోలీస్ అధికారులను ఖాళీ చేయించాలని కోరుతూ సోమవారం వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ లు డీజీపీ సీ వీ ఆనంద్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు రాజేంద్రనగర్ లో గల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల క్వార్టర్స్ లో నివాసం ఉంటున్న పోలీస్ అధికారులను ఖాళీ చేయించాలని కోరారు. విశ్వవిద్యాలయంలో గత 60 సం వత్సరాల క్రితం నిర్మించిన క్వార్టర్స్ లో విశ్వవిద్యాలయానికి చెందిన ఛీఫ్ వార్డెన్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ తదితర ఉన్నతాధికారులు నివాసం ఉండేవా రన్నారు. ఉన్నతాధికారులు వర్శిటీ క్వార్టర్స్ లో నివాసం ఉండటం వల్ల వసతి గృహాలలో ఉండే విద్యార్థుల భద్రత, సంక్షేమం, క్రమ శిక్షణ అంశాలను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. దానికి స్పందించిన డీజీపీ) సీవీ ఆనంద్ త్వరలోనే వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉంటున్న పోలీస్ అధికారులను ఖాళీ చేయిం చడం జరుగుతుందన్నారు.



డీజీపీ సీ వీ ఆనంద్ ను కలసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తదితరులు



# ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించకుంటే కఠిన చర్యలు

**ప్రజావాణికి 29 ఫిర్యాదులు.**

**ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలి.**

**అధికారులు విద్యాలయాలు, వసతి గృహాలను సందర్శించాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం):**

ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించకుండా అలసత్వం చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం 29 ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించడం జరిగిందన్నారు. మండల స్థాయిలోనూ వచ్చిన ప్రజావాణి ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజావాణి పోర్టల్ లో ప్రజల నుంచి వచ్చిన ఆర్జీల వివరాలను అప్లోడ్ చేస్తుండడంతో రాష్ట్రస్థాయిలోనూ ఉన్నతాధికారులు వీటిని పర్యవేక్షిస్తుంటారని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో పెద్ద ఎత్తున ఆర్జీలు పెండింగ్ లో ఉ ంచడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి బుధవారం వివిధ శాఖల అధికారులు తమ సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించి ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే సోమవారంలోగా పెండింగ్ లో ఉన్న ఆర్జీలను పరిష్కరించాలని, అలసత్వం చూపే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రజావాణి పోర్టల్ లో లాగిన్ అయి తమకు సంబంధించిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ ఫరాల పంపిణి ప్రక్రియ బూత్ లెవెల్ అధికారుల పని తీరును మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. విద్యాలయాలు, వసతిగృహాలను సంబంధిత అధికారులు తరచు సందర్శిస్తూ, అక్కడి కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాలను కూడా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో మూడు చొప్పున ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తున్నామని, అక్కడి సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు మరమ్మత్తుల పనులు కూడా జరుగుతున్నాయని సంబంధిత అధికారులు సకాలంలో పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు అందజేయడం జరిగిందని సాధ్యమైనంత తొందరగా యూనిఫామ్స్ కూడా ఇచ్చేలా స్టిచ్చింగ్ వేగవంతం చేయించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు

**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్**

**తన ప్రాణాలకు రేవంత్‌రెడ్డిదే బాధ్యత...**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం):**

"కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాపక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుంది" అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో, నియోజకవర్గ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనతో పాటు మాజీ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గద్వాల నియోజకవర్గంలో ర్యాలంపాడు, గట్టు ఎత్తిపోతల పథకం, నెట్టంపాడు ప్రాజెక్టుల పనులు వేగంగా జరిగాయని, అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పెండింగ్ పనులు "ఎక్కడ వేసిన గొంగడి అక్కడే" అన్న చందంగా మారాయని విమర్శించారు. మొన్నటి గద్వాల పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టులపై ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు. చిన్న కాలువల్లో పెరిగిన చెట్లను కూడా తొలగించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, గద్వాల ప్రజల సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా ఈ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న కుంభకోణాలపై బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తోందని తెలిపారు. తొలి సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు, పుస్తకాలు, ఇతర సామగ్రి అందే వని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం నాసిరకం వస్తువులతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా తన భద్రతను కుదించడంపై ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను 26 ఏండ్లు ఐపీఎస్ అధికారిగా దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పనిచేశానని, రాష్ట్రపతి శౌర్యపతకం కూడా పొందానని గుర్తుచేశారు. గతంలో ఏ ప్రభుత్వం తన సెక్యూరిటీని తగ్గించలేదని, నిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే కాంగ్రెస్ సర్కార్ ఈ కక్షసాధింపు చర్యలకు దిగిందని ఆరోపించారు. తన భద్రతను తొలగించినా, బెదిరించినా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపనని, ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌ను వీడేది లేదని స్పష్టం చేస్తూ, తన ప్రాణాలకు రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర రెడ్డి, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జి.రాఘవేంద్ర రెడ్డి, అంగడి బసవరాజ్, ఆతికూర్ రెహమాన్, కౌన్సిలర్ చంటన్న, కురవ పల్లయ్య, చిన్నపాడు ఆంజనేయులు, మోనేష్, గంజిపేట రాజు, చక్రధర్ రెడ్డి, మక్బుల్, తిమ్మప్ప గౌడ్, వెంకటేష్ నాయుడు, నూర్ పాషా, శ్రీరాములు, ముని మౌర్య, గోవిందు, కావలి గోపి, గాజుల కృష్ణారెడ్డి, డ్యామ్ శ్రీను, సామెలు, ఇంజన్న, మాలిక్, రాము, రమేష్, తిమ్మప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బోరవెల్లి పాఠశాలలో డీఈఓ విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29 (నమస్తే ఉదయం)**


మానవపాడు మండలం బోరవెల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం విద్యులతతో ఫోన్‌లో మాట్లాడిన డీఈఓ, పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలపై ఆరా తీశారు. విద్యార్థుల చదువుకు భంగం కలగకుండా పరస్పర సహకారంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వహణపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదులను పరిశీలించిన డీఈఓ భోజన నాణ్యత, పరిశుభ్రత లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. పాఠశాల క్రమశిక్షణ, విద్యార్థుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని హామీ ఇస్తూ, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఎంఈఓ శివప్రసాద్‌ను డీఈఓ ఆదేశించారు.



# నేడు రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, జూన్ 29(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. సెక్షన్ పరిధిలో చిన్నపాటి నిర్వహణ పనులు , చెట్ల కొమ్మల కత్తిరింపు చేపట్టేందుకు పెర్మారెడ్డి హిల్స్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలలో మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 వరకు అశోక్ విహార్‌అప్పర్‌పల్లి చింతల్‌మెట్ ఎక్స్ రోడ్ పెర్మారెడ్డి హిల్స్ హ్యాపీ హోమ్స్ , చుట్టుపక్కల ప్రాంతాలు, సహారా హోమ్స్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4:00 నుండి 5:00 వరకు మహమ్మదాబాద్ 9 నెం. జలాల్ బాబా నగర్ భూపాల్ నగర్ మహమ్మదాబాద్ , పరిసర ప్రాంతాలు, ఎన్.ఐ.ఆర్.డి. ఫీడర్ తీ ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:00 వరకు ఎన్.ఐ.ఆర్.డి. మరియు పరిసర ప్రాంతాలు ఈ



ప్రణాళికాబద్ధమైన విద్యుత్ కోత వలన కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నాము. వినియోగదారులు సహకరించవలసిందిగా కోరుతున్నాము. 4. 11 కేవీ జయశంకర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:00 వరకు జయశంకర్‌వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**హిమాయత్ సాగర్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం చెట్లు నరకడం, ఇతర నిర్వహణ పనుల నిమిత్తం ఫీడర్లపై విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు. మంగళవారం ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు కేవీ రిచ్‌మండ్ విల్లాస్ ఫీడర్ పరిధిలో కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, పిడటి కాలనీ ఎ, సి, డి స్పెషల్ బ్లాక్‌లోని కొంత భాగం,మధ్యాహ్నం 14:30 గంటల నుండి. సాయంత్రం 5 గంటల వరకు, మిలిటరీ-XX ఫీడర్ పరిధిలో సన్ సిటీ మెయిన్ రోడ్, స్పెషల్ బ్లాక్, బి-బ్లాక్, హైదర్ ఎన్‌క్లేవ్, ఆఫీసర్స్ కాలనీ, విశ్వాస్ నగర్, మేపుల్ టౌన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయా సెక్షన్ల ఇంజనీర్లు కోరారు.

# రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలకు గుర్తింపు లేకుండా పోతుంది

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంషుద్దీన్**

**బుద్వేల్, జూన్ 29 (నమస్తే ఉదయం)**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు శంషుద్దిన్

తెలంగాణ రాష్ట్రంలో అసలైన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర లకు గుర్తింపు లేకుండా పోతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంషుద్దీన్ ఆరోపించారు. సోమవారం అత్తాపూర్ సర్కిల్ ఉప్పర్ పల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన కార్యకర్తలకే అధిక ప్రాదన్యం ఇసు న్నారన్నారు. కాంగ్రెస్ లో క్రమ శిక్షణ కలిగిన పార్టీ నాయకులకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. తాను 19 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ లో క్రమ శిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేస్తున్నానన్నా రు. అయిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఇతర పార్టీల నాయకులకు మాత్రం కాంగ్రెస్ లో పెద్ద పీట వేసు బి న్నారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ ల సమావేశంలో అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన వారికి అవకాశాలు ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ లో చేరినప్పటి నుంచి అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను అణగద్రొక్కుతున్నారని వాపోయారు.

# పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

**బుద్వేల్, జూన్ 29 (నమస్తే ఉదయం)**

మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు సోమవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 33,740లు, ఏడు సెల్ఫోన్లు, ఆరు సెట్ల ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఇన్స్పెక్టర్ సత్యనారాయణ వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీలో కొందరు పేకాట ఆడుతున్నారని తెలిసి వెళ్లి చూడగా పేకాట ఆడుతున్నది నిజమేనని తెలిసింది. పేకాట ఆడుతున్న గగన్పహడ్ కు చెందిన అల్లూరి కిషోర్, ఈ యాదయ్య, ఎ భాస్కర్ రెడ్డి, ఆర్ వెంకటేశ్ గౌడ్, తలారి ఎల్లయ్య, ఈ రామక్రిష్ణ లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిం దన్నారు.

# గంజాయి సేవిస్తు పేకాట్ల ఆడుతున్న నలుగురు అరెస్ట్

**బుద్వేల్, జూన్ 29 (నమస్తే ఉదయం):**

మైలార్దేవుపల్లి టాటానగర్ లో గల బండారి డోర్ గోదాము లో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రాగా పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. గంజాయి త్రాగుతు నలుగురు యువకులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.6,470లు, నాలుగు సెల్ఫోన్లు, ఒక సెట్ ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. బాబుల్ రెడ్డినగర్ కు చెందిన భగవాన్ కుమార్, టాటానగర్ కు చెందిన పింటు రామ్, బాబుల్ రెడ్డినగర్ కు చెందిన ఆదికంట మహంతి, శ్రీరాం కాలనీ కి చెందిన మహేందర్ కుమార్ లను అరెస్ట్ చేశారు.

# కొండాపురం గ్రామంలో ఏరువాక పండుగ వేడుకలు

**జట్కా పద్ధతిలో పోలమ్మ దేవతకు కోళ్ల సమర్పణ**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం)**



కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో ఏరువాక పండుగ వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభాన్ని సూచించే ఈ పండుగ సందర్భంగా, గ్రామంలోని శ్రీ పోలమ్మ దేవత చెంత రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో భాగంగా హిందూ సంప్రదాయం ప్రకారం జట్కా పద్ధతిలో కోళ్లు పోలమ్మ అమ్మవారికి సమర్పించి, కోళ్లు కోయడం జరిగింది. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని, అలాగే పశుసంపద మరియు కోళ్ల వంటి జీవాలు ఎటువంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా వృద్ధి చెందాలని ఈ సందర్భంగా బీజేపీ ఓబీసి మండలాధ్యక్షులు ముంగ్లీ వీరేష్ రెడ్డి గ్రామదేవతను ప్రార్థించారు. ఈ వేడుకల్లో కొండాపురం మరియు చుట్టుపక్కల గ్రామాల రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఏరువాక ఉత్సాహంతో నూతన వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.



# భక్తిశ్రద్దలతో ఏరువాక పౌర్ణమి

**కిటికిటలాడిన శ్రీ సుంకులమ్మ అమ్మవారి ఆలయం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం):**

గద్వాల: జోగుళాంబ గద్వాల జిల్లాలో రైతులు ఏరువాకా పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలో రైతులు పాడిపశువులను, ఎడ్లను గ్రామ సమీపంలో ఉన్న వాగులు, చెరువుల వద్దకు తీసుకువెళ్లి వాటిని నీటితో శుభ్రంగా స్నానం చేయించి రంగు రంగుల దారాలు కట్టి రంగులతో అందంగా అలంకరించారు. అనంతరం ఇంటి వద్ద వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి రైతులు రకరకాల పిండి వంటలు చేసి ఆహారంగా వాటికి ప్రేమతో తినిపించారు. పశువులను రైతులు తమ కుటుంబంలో ఒకరిలా చూసుకుంటామని ఆయా గ్రామ రైతులు పేర్కొన్నారు. సాయంత్రం కాగానే డప్పు చప్పుళ్ల నడుమ ఎడ్లబండ్లతో దేవాలయాల నుంచి ప్రధానవీదుల గుండా బండ్లతో ర్యాలీ నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సుంకులమ్మ అమ్మవారికి పోటెత్తిన భక్తజనం.....**

ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని గద్వాల పట్టణంలోని శ్రీ సుంకులమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఏరువాక పండుగ సందర్భంగా సుంకులమ్మ అమ్మవారికి కోళ్లను కోసి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు.

# గుమ్మడిదల మండలంలో 70 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, జూన్ 29 (నమస్తే ఉదయం):**

అభివృద్ధే లక్ష్యంగా వివిధ సౌకర్యాల కోసం నిధులు సమకూర్చి పనులు చేపడుతున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డి గూడెం, అనంతారం, కానుకుంట గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా మంజూరైన 70 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్ళడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. మౌళిక సదుపాయాలు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, ఎంపీడీవో ఉమాదేవి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, వెంకటేష్, సర్పంచులు శ్రీను, నర్సింగ్ రావు, గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## గద్వాలలో ఘనంగా ‘ఏరువాక పున్నమి’ ఉత్సవాలు

**తోరణం లాగే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29 (నమస్తే ఉదయం)**

రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, సకాలంలో వర్షాలు కురిసి రైతాంగం ఆర్థికంగా ఎదగాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం గద్వాల మున్సిపాలిటి పరిధిలోని 32వ వార్డు కౌన్సిలర్ ముత్యాల లక్ష్మి తనయుడు ముత్యాల రవి ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా సాంప్రదాయబద్ధంగా “తోరణం లాగే కార్యక్రమం” నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి హాజరై, బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి తోరణాన్ని లాగారు. బండ్ల సాయి సాకేత్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఏరువాక శుభాకాంక్షలు. సకాలంలో వర్షాలు పడి, ప్రభుత్వ కొనుగోళ్లతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. తోరణం పోటీల్లో విజేతగా నిలిచిన సద్దెల రాముడుకు గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ స్పాన్సర్ చేసిన 5 తులాల వెండి చైన్ బ్రాస్‌లెట్‌ను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రశేఖర్, స్థానిక నాయకులు, రైతులు, మహిళలు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు







## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులుగా ఆంజనేయులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం):**

గద్వాల పట్టణంలో రెండు రోజుల పాటు జరిగిన ఏఐటీయూసీ జిల్లా మహాసభలు సోమవారం తో ఘనంగా ముగిశాయి. రాష్ట్ర కార్యదర్శి ఎం. నరసింహ, జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేమ్ పావనిల సమక్షంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులుగా బి. ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శిగా జి. రంగన్న, కార్యనిర్వాహక అధ్యక్షుకుగా తాటికుంట వెంకటేష్, కోశాధికారిగా, ఆశన్న, వీరితో పాటు 6 గురు ఉపాధ్యక్షులు, 6 గురు సహాయ కార్యదర్శులు మరియు 37 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.



## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు

**బొల్లారం డివిజన్ పారిశుద్ధ్య అధికారి వినోద్ హెచ్చరిక**

**పటాన్ చెరు, జూన్ 29( నమస్తే ఉదయం):**

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదని బొల్లారం డివిజన్ పారిశుద్ధ్య అధికారి వినోద్ హెచ్చరించారు. చెత్త సేకరణ కోసం జిహెచ్ఎంసి వాహనాలు ప్రతి రోజూ డివిజన్ పరిధిలో నడుస్తున్నప్పటికీ చాలా మంది బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నారని, ఇప్పటికే ఎన్నో సార్లు ప్రత్యేక కార్యక్రమం ద్వారా చెత్త తొలగించి పరిసరాలను శుభ్రం చేయడం జరిగిందని ఆయన చెప్పారు. చెత్త బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేసినా చాలా మంది బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం మానుకోవడం లేదని, ఇకపై ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే భారీగా జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

## ఉత్సాహాభరితంగా కొనసాగిన “స్లో బైక్ రేసింగ్” పోటీలు

**విజేతలకు బహుమతుల ప్రదానం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29(నమస్తే ఉదయం)**

ఏరువాక పౌర్ణమి సందర్భంగా సోమవారం కేటి దొడ్డి మండలం కొండాపురం గ్రామంలో యువతలో రోడ్డు భద్రత, వాహన నియంత్రణపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా యువత ఆధ్వర్యంలో “స్లో బైక్ రేసింగ్” (అతి నెమ్మదిగా బైక్ నడిపే) పోటీలను అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో నిర్వహించారు. ఈ పోటీలలో సాధారణ రేసింగ్‌కు భిన్నంగా... ఎవరు కింద కాలు పెట్టకుండా, బైక్ ఇంజన్ ఆపకుండా, అత్యంత నెమ్మదిగా గమ్యస్థానాన్ని చేరుకుంటారనే నిబంధనను విధించారు. ఈ వినూత్న పోటీలో పాల్గొనేందుకు స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బైక్‌పై పట్టు, శారీరక సమతుల్యత మరియు మానసిక ఏకాగ్రతను పరీక్షించేలా సాగిన ఈ పోటీలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.






జూమ్ కాల్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం రమేష్.

## వానొచ్చినా... ట్రాఫిక్ ఆగద్దు!

**వాటర్ లాగింగ్ పాయింట్లపై నిరంతర నిఘా ఉంచాలి**

**రంగంలోకి 150 మంది గ్రేహౌండ్స్, ఆక్టోపస్ సిబ్బంది**

**సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్ సిద్ధం చేయండి.. సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్**

**శేరిలింగంపల్లి : జూన్ 29, (నమస్తే ఉదయం)**

వర్షాకాలంలో ఐటీ కారిడార్‌తో పాటు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా వ్యవహరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్, అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులతో సీపీ ‘జూమ్’ ద్వారా సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల సమయంలో రోడ్లపై నీరు నిలిచే (వాటర్ లాగింగ్) ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ జీహెచ్ఎంసీ, జలమండలి తదితర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డితో పాటు కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పోలీస్ స్టేషన్ల వారీగా కేటాయించిన సుమారు 150 మంది గ్రేహౌండ్స్, ఆక్టోపస్ సిబ్బంది పనితీరుపై సీపీ రమేష్ సమీక్షించారు. వర్షం పడే సమయంలో వీరు ప్రజలకు అందుబాటులో ఉంటూ ట్రాఫిక్‌ను క్లియర్ చేసేలా తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్‌లు, యూ-టర్న్‌లను అడ్డుకునేలా వాహనాలను పార్క్ చేసే వారిపై, రాంగ్ రూట్‌లో వచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైన చోట ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్లు వద్ద శాశ్వత పరిష్కారం చూపేలా ఎక్కడెక్కడ నీరు నిలుస్తుందో గుర్తించి ఒక సమగ్ర ‘మాస్టర్ డాక్యుమెంట్’ సిద్ధం చేయాలని అధికారులకు సీపీ సూచించారు. అనుమతులు లేకుండా రోడ్డు కటింగ్ పనులు చేపడితే కుదరదని పనులు ప్రారంభించే ముందే ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని, ప్రత్యామ్నాయ ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ప్రస్తుతం విప్రో జంక్షన్, డీఎల్ఎఫ్ జంక్షన్, షాపూర్ నగర్, కూకట్‌పల్లి వై-జంక్షన్, మియాపూర్, నిజాంపేట్ ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ పనులను వేగవంతం చేయాలని సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు.

**సిబ్బంది భద్రత ముఖ్యం**

రాత్రి వేళల్లో భారీ వర్షాల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది తప్పనిసరిగా రిఫ్లెక్టివ్ జాకెట్లు, రెయిన్ కోట్లు ధరించాలని. ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని ప్రయాణాన్ని అందించడమే మన లక్ష్యమన్నారు. ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.



## కేటిదొడ్డి మండలంలో ఉత్సాహంగా ఎద్దుల పందాల పోటీలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 29 (నమస్తే ఉదయం)**

ఏరువాక పౌర్ణమి పండుగను పురస్కరించుకుని సోమవారం కేటిదొడ్డి మండల కేంద్రంతో పాటు కుచినెర్ల గ్రామంలో ఎద్దుల పందాల పోటీలు నిర్వహించారు. ముందుగా రైతులు గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఎద్దులకు స్నానాలు చేయించి, వివిధ రంగులు వేసి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఎడ్ల పందెం పోటీలో పాల్గొనేందుకు రైతులు ఉత్సాహంగా తరలివచ్చారు. గ్రామ సంస్కృతి, పురాతన వ్యవసాయ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కేటిదొడ్డి గ్రామ చావిడి వద్ద ఎద్దుల ఊరేగింపు వేడుకను గ్రామస్తులు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. గ్రామ చావిడి సమీపంలో ఉన్న స్తంభాలకు ఈత తాడును గట్టిగా కట్టి, ఆ తాడు ఆధారంగా ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దులతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎద్దుల బలాన్ని, వాటి నైపుణ్యాన్ని ప్రదర్శించేలా సాగిన ఈ సాంప్రదాయ క్రతువు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. గ్రామానికి శుభం కలగాలని, వ్యవసాయం సరుగా సాగాలని కాంక్షిస్తూ ఏటా ఈ తరహా వేడుకలను నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోంది అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు ప్రేక్షకుల కేరింతలతో సందడి నెలకొంది. వ్యవసాయ పనులన్నీ ముగిసి పంటలకు రైతు ఇళ్లకు చేరిన వేళ నిర్వహిస్తున్న పోటీలు ప్రజలకు సరికొత్త వినోదాన్ని పంచుతున్నాయి. విజేతలను గ్రామ పెద్దలు, నిర్వాహకులు అభినందించారు.